## క్లుప్తంగా

### రేపు అలయ్ బలయ్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో సోమవారం సాయంత్రం అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శివకుమార్ మిత్ర మండలి తెలియజేసింది. దసరా ఉత్సవాలు ముగిసినందున నిర్వహిస్తున్న అలయ్‌బలయ్ కార్యక్రమానికి పట్టణవాసులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

జడ్చర్ల: ఓ వ్యక్తి తన అక్క, అమ్మను నమ్మించి వారి వద్ద ఉన్న బంగారం నగలను తీసుకోవడమేగాక.. వారు ఉంటున్న ఇంటిపై రుణం తీసుకుని వారిపేరున అనేక చోట్ల అప్పులు చేసి చివరకు వారిని బెదిరించడంతో వారు ఇల్లు విడిచి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయారని.. ఇందుకు కారకుడైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపల్లిలో హమీద బేగం తన కూతురు పర్వీన్‌తో కలిసి ఉంటుంది. జడ్చర్లలోని గాంధీనగర్‌కు చెందిన వ్యక్తి ఎండీ ఇమ్రాన్ పర్వీన్‌ను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి వారి వద్ద ఉన్న 7 తులాల బంగారు నగలను తీసుకోవడమేగాక వారు ఉంటున్న ఇంటిపై కూడా లోన్ తీసుకున్నాడు. తనకు అవసరం ఉన్నప్పుడల్లా తమ చేత అప్పులు చేయించి డబ్బులు తీసుకున్నాడు. చివరకు డబ్బులు, నగలు అడగడంతో బెదిరించాడు. అతని బెదిరింపులకు భయపడిన తన అమ్మ, అక్క ఇల్లు విడిచి వెళ్లారని, బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కూతురు నజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### సత్యసాయి శతజయంతి వేడుకలు ప్రారంభం



జడ్చర్ల టౌన్: సత్యసాయి శతజయంతి వేడుకలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 4వ వార్డులోని సాయిమందిరంలో పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత హాజరై మహిళలకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయిమార్గంలో పయనిస్తూ పదిమందికి ఉపయోగపడే పనులు చేయాలని పిలుపునిచ్చారు. సాయంత్రం పల్లకీసేవ జరిపించారు. రాత్రికి రుద్రాభిషేకం, అష్టోత్తరం, భజన, సత్సంగం, మహామంగళహారతి సమర్పించారు. అనంతరం అల్పాహార ప్రసాదం పంపిణీ చేయడంతో మొదటిరోజు వేడుకలు ముగిశాయి. రెండో రోజు వారణాసి ఫణీంద్ర ఆధ్వర్యంలో పుట్టపర్తి నుంచి వచ్చిన రుత్వికులతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయనున్నారు.

### పాఠశాలలో మౌలిక వసతుల మరమ్మతు



నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు తదితర ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మూత్రశాలల మరమ్మతులు, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్లకు వివరించామని, అవి పూర్తి కావచ్చాయని తెలిపారు. సెలువుల నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఆర్‌ఓ ప్లాంటు నిర్వహణకు సహకారం

దేవరకద్ర: దేవరకద్ర జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణ కోసం శనివారం పూర్వ విద్యార్థులు సహకారం అందించారు. 1984–85 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పడమటి మోహన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అరుణ ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణకు సహకారం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయడానికి ముందుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పాఠశాల తరఫున సన్మానించారు. హెచ్‌ఎం రామలింగం, క్యాతరిన్, విజయకృష్ణ, వేణుగోపాల్, గోపాల్‌రెడ్డి, పరమేశ్, ప్రమీలారాణి, సుధాకర్, రాజశేఖర్, అశోక్, సౌజన్య, కవిత, షరీఫ్, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్లాట్లుగా.. మార్చేసి



గొల్లపల్లి శివారులో కమ్యూనిటీ స్థలాలను ప్లాట్లుగా మార్చిన వెంచర్

- పదిశాతం స్థలాలు మాయం
- ప్లాట్లుగా మారుస్తున్న వైనం
- అక్రమార్కుల ఆగడాలు
- పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఏర్పాటు చేసిన కచ్చ లేవుట్‌లలో నిబంధనల మేరకు విడిచి పెట్టిన పదిశాతం కమ్యూనిటీ స్థలాలు మాయమవుతున్నాయి. వెంచర్లు చేసిన వారే మొదటగా తీసుకున్న లేఅవుట్లను మార్పులు చేర్పులు చేసి కమ్యూనిటీ అవసరాలకు వదలిన స్థలాలను అప్పనంగా ప్లాట్లుగా మార్పు చేసి విక్రయిస్తున్నారు. ఆయా స్థలాలను రక్షించాల్సిన అధికారులు కళ్లప్పగించి చూడడం తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**గొల్లపల్లి శివారులో..**

మండలంలోని గొల్లపల్లి పంచాయతీ శివారులో దాదాపు 14.20 ఎకరాల విస్తీర్ణంలో ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. వెంచర్‌లో 59శాతం ప్లాట్లు, 31 శాతం రోడ్లు, 10 శాతం కమ్యూనిటీ అవసరాలకు మూడు చోట్ల వెంచర్‌లో స్థలాలను విడిచి లేఅవుట్ తయారు చేసి జీపీ నుంచి అనుమతి తీసుకున్నారు. తదుపరి వెంచర్‌లో ప్లాట్లు మొత్తం అమ్మేశారు. ప్లాట్లు అమ్మిన తరువాత వెంచర్ నిర్వాహకులు అక్రమాలకు తెరతీశారు. సదరు లేవుట్‌ను మార్చివేసి కొత్త లేవుట్‌ను సృష్టించారు. ఇంకేముందు మాజీగా మారిన సర్పంచ్ సంతకం, జీపీ స్టాంపుతో కొత్త లేఅవుట్‌ను శ్రీకారం చుట్టారు. కొత్త లేవుట్‌లో కమ్యూనిటీ అవసరాలకు విడిచిన 10శాతం స్థలాలను రెండుచోట్ల మార్పు చేసి ప్లాట్లుగా మార్చి అక్రమాలకు పాల్పడ్డారు.

**అంతటా ఇదే పరిస్థితి**

జడ్చర్ల మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, నవాబ్‌పేట, రాజాపూర్, ఊర్కొండ మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ఏ వెంచర్‌లో ఎక్కడా కమ్యూనిటీ అవసరాలకు విడిచిన స్థలాలు లేవంటే అతిశయోక్తి కాదు. మొదటగా స్థలాలను విడిచి లేఅవుట్లను తయారు చేయడం, ప్లాట్ల విక్రయాలు పూర్తయ్యాక అక్రమంగా లేఅవుట్‌లను మార్చి కొత్తగా మరో లేఅవుట్‌ను సృష్టించి కమ్యూనిటీకి వదలిన 10శాతం స్థలాలను ప్లాట్లుగా మార్చి నంబర్లు వేసి అక్రమంగా విక్రయించారు.

**జడ్చర్ల మండలంలో..**

జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి, మాచారం, గంగాపూర్, బోయలకుంట, పోలేపల్లి తదితర జీపీల పరిధిలో పదిశాతం స్థలాలను అక్రమంగా అమ్మేశారు. ఇందుకు సంబంధించి జీపీలలో సైతం రికార్డులు లేకుండా చేశారు. అయితే ఎల్‌ఆర్‌ఎస్‌లో ఖాళీ స్థలం రుసుమును చెల్లిస్తుండడం కారణంగా పదిశాతం కమ్యూనిటీ స్థలాలను విడవాల్సిన అవసరం లేదని కూడా అక్రమార్కులు వాదిస్తున్నారు.

**కచ్చలేవుట్లతో ఇబ్బందులు**

కచ్చ లేవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడక తప్పదు. ఇలాంటి లేవుట్లలో రోడ్ల వెడల్పులు తక్కువగా ఉండడం, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, బీటీరోడ్లు లేకపోవడం, మొక్కల పెంపకం, పార్కు, ప్రభుత్వ భవనాల నిర్మాణం తదితర అవసరాలతోపాటు కనీసం కాలనీవాసులు సమావేశమవడానికి కొంతస్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇక అక్కడక్కడా విడిచిన స్థలాలు కొందరు కబ్జా చేయడం, మరికొందరు తమ కుల, వృత్తి సంఘాల భవనాలకు పరిమితం చేశారు.

**చర్యలు చేపట్టాలి**

కమ్యూనిటీ స్థలాల పరిరక్షణకు సంబంధిత అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే చాలా వెంచర్లలో పదిశాతం స్థలాలు ప్లాట్లుగా మార్చిన వెంచర్ల నిర్వహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం**



గొల్లపల్లి శివారులో ఏర్పాటు చేసిన వెంచర్లకు సంబంధించి 10శాతం స్థలాలను ప్లాట్లుగా మార్చి విక్రయించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కమ్యూనిటీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనునాయక్, గొల్లపల్లి తండా

**చర్యలు చేపడుతాం**



మున్సిపాలిటీలో డీటీసీపీ లేఅవుట్ల పరిధిలో కమ్యూనిటీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపడుతాం. 2020 తర్వాతి వెంచర్లలో కమ్యూనిటీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసువడానికి అవకాశాలున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, తదితర అభివృద్ధి చేయని 16 వెంచర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ



వెంచర్‌లో మూడు చోట్ల కమ్యూనిటీ స్థలాలు విడిచి రూపొందించిన మొదటి లేవుట్

### నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మహమ్మదాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తప్పకుండా హాజరుకావాలనికోరారు.

### 'స్థానిక' ఎన్నికల్లో గెలుపునకు పనిచేయాలి

పాలమూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం పనిచేయాలని బీజేపీ సీనియర్ నేత పాండురంగారెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండల పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం అందరిని కలుపుకొని వెళ్లాలని, ఈ ఎన్నికల్లో అభ్యర్థి చాలా కీలకమని అభ్యర్థి ఎంపికలో అందరిని కలుపుకొని పోవాలన్నారు. సాధారణ ఎన్నికలు, స్థానిక ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గంగన్న, రాజుగౌడ్, సతీశ్‌కుమార్, వెంకటేశ్వరమ్మ, మహేశ్‌గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### నల్లాపైపు పగిలి రోడ్డుపై నీరువృథా



చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఆత్మకూర్, దేవరకద్ర రోడ్డుపై మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లకు ఇరువైపుల ఉన్న నల్లనీటి పైపులు పగిలి నీరు వృథాగా పారుతున్నది. రోడ్డుపై నీరు ప్రవహిస్తు వాహనదారులకు ఇబ్బందులు కలిస్తుంది. డివైడర్ మధ్యలో నాటిన చెట్లకు నీరు పట్టేందుకు గతంలో అధికారులు నల్లా పైపులు ను ఏర్పాటు చేశారు. పైపులు పగిలి వారం రో జులుగా నీరు వృథాగా పారుతుంది. నీరు వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా పగిలిన పైపు లైన్‌లను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

### వాహనాల తనిఖీ

కృష్ణా: మండల సరిహద్దులో శనివారం ఎస్‌ఐ ఎండీ నవీద్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు సరిహద్దులో శాశ్వత పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేయడంతో పాటు కర్ణాటక నుంచి మద్యం వంటి నిషేధిత పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఎన్‌హెచ్‌-167పై పైపులైన్ లీకేజీ



బాలికల జూనియర్ కళాశాలకు ఎదురుగా మెయిన్ రోడ్డుపై ఏరులై పారుతున్న తాగునీరు



షాషాబ్‌గుట్టకు వెళ్లే మలుపు వద్ద మెయిన్ రోడ్డుపై లీకేజీ అవున్న తాగునీరు

- నడిరోడ్డుపై తాగునీరు వృథా అవుతున్న వైనం
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర పరిధిలో జాతీయ రహదారి– 167పై మూడు చోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. తాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని రోజులుగా ఈ మెయిన్ రోడ్డుపై కొత్త బస్టాండు సమీపంలో బాలికల జూనియర్ కళాశాలకు ఎదురుగా, న్యూటౌన్ చౌరస్తాలో, అలాగే షాషాబ్‌గుట్టకు వెళ్లే మలుపు వద్ద తాగునీరు ఏరులై పారుతోంది. వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా చోట్ల ఆగి వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఈఈ నర్సింహను వివరణ కోరగా త్వరలోనే క్షేత్రస్థాయికి తమ సిబ్బందిని పంపించి బాగు చేయిస్తామన్నారు.

# నమూనా ఇంటికి నయా లుక్



వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నమూన



తాజాగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు

- ఇరవై ఏళ్లకు మారిన రూపురేఖలు
- అప్పట్లో రూ.లక్ష, ప్రస్తుతం రూ.5లక్షలు

నవాబుపేట: ఇందిరమ్మ నమూనా ఇంటికి నయాలుక్ సంతరించుకొంది.. గతంలో ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ సీఎంగా ఉన్నతరుణంలో నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేలా రూ.లక్షతో ఇందిరమ్మ నమూనా ఇంటిని నిర్మించి లబ్ధిదారుల ముందుంచారు. అప్పట్లో ఈ పథకం నిరుపేదలకు వరంలా మారింది. సరిగ్గా 20 ఏళ్ల అనంతరం తెలంగాణలో మరోసారి అదే ఇందిరమ్మ ఇంటిని నిరుపేదల కోసం ప్రభుత్వం తీసుకొచ్చింది. కాగా, గతంలో ఒకే పడక గది ఉండగా.. దానికి రూ.లక్ష వెచ్చించింది. తాజాగా అదే ఇంటిని కాస్తా మార్చి రూ.5లక్షలు వెచ్చించి కొత్త ఇంటిని నిర్మించారు. దీంతో 20ఏళ్లలో ఇందిరమ్మ ఇంటి ధర కాస్తా 5రెట్లు పెరగటం విశేషం. కాగా, ఈ మాడల్ ఇల్లు ప్రభుత్వం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్మించింది.

# మలుపు.. ప్రమాదాలకు పిలుపు



గోప్లాపూర్ వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా మలుపు

భూత్పూర్: ప్రమాదకర మలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని వాహ న దారులు కోరుతున్నారు. పట్టణంలోని గోప్లాపూర్ వెళ్లే రహదారిలో మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ దారిలో కర్వేనకు వెళ్లేమార్గం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్తమొల్గర, చౌళ్ల తండా వద్ద రెండు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మలుపుల వద్ద సూచికల బోర్డు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కలిసి కట్టుగా పనిచేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్నాసాగర్‌లో దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలకు 420 హామీలను చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల పేరుతో ఎంత బాకీ ఉందో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. జరగబోయే గ్రామ, మండల స్థాయిలో మన వాయిస్ వినిపించాలంటే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మండలాధ్యక్షుడు బస్వరాజ్‌గౌడ్, అడ్డాకుల మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, సరోజ్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమూద్, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూచిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ



నవాబుపేట బతుకమ్మ చెంత మహిళల ఆట పాటలు



బతుకమ్మను ఎత్తుకున్న చిన్నారి

నవాబుపేట: చిత్తూచిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోనా.. అంటూ మహిళలు ఆటాపాటలతో మండల కేంద్రంలో బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఏడాది దసరా తర్వాత బతుకమ్మ ముగింపు కార్యక్రమం జరుపుకోవటం ఆనవాయితీ. ఈ సందర్భంగా శనివారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించి పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలకు వాయినాలు అందించి సాగనంపుతారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బతుకమ్మలను అలంకరించుకుని ఆటపాటలతో హోరెత్తించారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో శివాలయం, హనుమాన్ ఆలయం, ప్రధాన చౌరస్తా వద్ద పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించిన అనంతరం గ్రామసమీపంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

# వైద్యవృత్తి దేవుడిచ్చిన వరం

- జయశంకర్ విశ్వకర్మ సేవాసమితి
- నీట్(ఎంబీబీఎస్)లో రాష్ట్రస్థాయి ర్యాంకర్‌కు సన్మానం



ఎంబీబీఎస్ సీటు సాధించిన హర్షితను సన్మానిస్తున్న విశ్వకర్మ సేవా సంఘం నాయకులు

మెట్టుగడ్డ: వైద్య వృత్తి దేవుడిచ్చిన గొప్ప వరమని జయశంకర్ విశ్వకర్మ సేవాసమితి అధ్యక్షుడు బ్రహ్మయ్య చారి అన్నారు. తెలంగాణ చౌరస్తా బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించిన హర్షితను విశ్వకర్మ సేవా సమితి, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైద్యవృత్తిలో మానవత్వంతో మెలగడమే కాకుండా నిరుపేదలకు సేవ చేసుకునే గొప్ప అవకాశమని, ఇలాంటి వృత్తిలో కొనసాగడం అదృష్టమని అన్నారు. విశ్వబ్రాహ్మణ కులస్తుల్లో హర్షితలాంటి ప్రతిభ గల విద్యార్థులు ఉండటం సంతోషమని, అలాంటి విద్యార్థులకు సేవా సమితి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది వీరబ్రహ్మయ్య చారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రమేశ్ చారి, బాబుచారి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ ఎర్రగుంటకట్టలో పోచమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీశరన్నవరాత్రుల్లో పూజలు చేశారు. శనివారం భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

### ఇద్దరిపై అట్రాసిటీ కేసు

చిన్నచింతకుంట: మండలంలోని పెద్ద వడ్డెమాన్‌కు చెందిన బుక్క నాగరాజు, బుక్క పవన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. పెద్దవడ్డెమాన్‌కు చెందిన బుక్క నాగరాజు, బుక్క పవన్ శుక్రవారం గ్రామంలోని చంద్రశేఖర్ శెట్టి ఇంటి ఎదుట రోడ్డుపై గొడవ పడుతున్నారు. అప్పుడే రోడ్డుపైకి వచ్చిన సత్యనారాయణ గొడవను చూసి ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే నాగరాజు, పవన్ కోపంతో ఊగిపోతూ సత్యనారాయణను కులం పేరుతో దూ షించారు. అందుకు సత్యనారాయణ వారిపై చిన్న చింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### జంతువులను రక్షించుకుందాం

కోస్గి రూరల్: మనవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను రక్షించుకుందామని జాతీయ హరితదళ సమన్వయకర్త వార్ల మల్లేషం అన్నారు. శనివారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మీర్జాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో 'పర్యావరణంలో జంతువుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అరుదైన జంతువులు అంతరించి పోతున్నాయన్నారు.

### రేపు స్థానిక ఎన్నికల నిర్వహణపై అవగాహన

మిడ్జిల్: స్థానిక ఎన్నికల నిర్వహణపై ఈనెల సోమవారం ఉదయం 11గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ యూపీ రాజు తెలిపారు. అన్ని పార్టీల నాయకులు సమావేశానికి హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోని ఎన్నికలపై అవగాహన పెంచుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

### మిడ్జిల్ ఎంఈఓగా సరస్వతి



మిడ్జిల్: మండల విద్యాధికారిణిగా మిడ్జిల్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం సరస్వతిని నియమిస్తున్నట్లు శనివారం సాయంత్రం డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతంలో ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న వస్పుల జీహెచ్‌ఎం వెంకటయ్య దసరా సెలవుల్లో ఎంఈఓ పదవి వద్దని, ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా కోరడంతో ఇన్‌చార్జి ఎంఈఓగా సరస్వతిని నియమించినట్లు పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో అందరి సహకారంతో విద్యావ్యవస్థను ప్రతి ష్టంగా ఉంచేందుకు తనవంతు కృషిచేస్తానని, సో మవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.